# తొలి మజిలీ

"అమ్మాయిగోరూ! బామ్మగారు మిమ్మల్ని లగెత్తుకు రమ్మంటున్నారు పట్నం నుంచి అల్లుడుగా రొచ్చారు" పరుగెత్తుకుంటూ వచ్చి చెప్పాడు వెంకన్న. ఊరి మధ్యగా వున్న చెఱువు ప్రక్క శివాలయంలో దట్టంగా పెరిగిన పచ్చగన్నేరు చెట్లమధ్య ఖాళీస్థలంలో కళ్ళకు గంతలుకట్టి దాగుడుమూతలాడుతూ ఒక్క సారికూడా దొంగ కాకుండా చాకచక్యంగా తప్పించుకుంటున్న సుమిత్రని దొంగ చెయ్యాలని పట్టుదలగావున్న వసంత వెంకన్నమాటలు విన్పించటంతో ఆగి నిలబడిపోయి కళ్ళకున్న గుడ్డని విప్పేసుకుంది. "ఏమి టేమిటి?" అమ్మాయిల బృందం, అంతా వెంకన్న చుట్టూ మూగింది.

"పట్నంనుంచి అల్లుడుగారొచ్చారా! ఓహో! నేను పెళ్ళిలోగూడా చూడలేదు. పదండే రాధా చూద్దాం!" అంది విమల.

"ఎన్నిరోజులుంటారో! పాపం వసంతకి యిహ బందిఖానా! వాళ్ళ బామ్మ చచ్చినా బైటకు రానియ్యదు" అంది లక్ష్మి.

"వాళ్ళ బామ్మ అంటున్నావు—ముందసలు యిది వస్తుందేమిటి ఆయనగార్ని వదలి?- మళ్ళీ కన్నెత్తిగూడా మాడదు" వసంతవైపు వెక్కిరింపుగా చూస్తూ అంది సీత.

"ఏడిశావు!" అంది వసంత నవ్వు తెచ్చిపెట్టుకుంటూ. క్షణం క్రితం బంగారురంగులో మెరుస్తున్న వసంత మొహం ఈ వార్త వినగానే మొగ్గరేకలువలా అయిపోయింది.

"బేగిరండిమరి! బాబామ్మగారు యిప్పటికే కోపం సేస్తున్నారు. మీరు సుమిత్రమ్మగారింటికి వెళ్తున్నానని సెప్పారంట గదా - రండి, రండి!" వెంకన్న తొందర చేశాడు.

"అట్లా జూస్తావేం! నిలువు గుండ్లేసుకుని? పద, నన్ను రేపు దొంగని చేద్దువుగానిలే" నవ్వుతూ అంది సుమిత్ర. అందరూ కదిలి గుంపుగా యింటివైపు బైల్దేరారు.

"అల్లుడుగారు యీాది వరండాలో కూర్చున్నారు, దొడ్లోనుంచి పదండి!" వెనకనుంచి వస్తున్న వెంకన్న వీధి గుమ్మంలో నుంచి రావటానికి వస్తున్న వాళ్ళని హెచ్చరించాడు.

"హోవోయ్! మాకేమిటి భయం? మేం ఇటేవస్తాం!" విమల ధైర్యంగా దారితీసింది. శ్రీధర్ ని జూడాలనే ఆసక్తితో వున్న వాళ్ళంతా అనుకరించారు. అందరితో పాటు వసంతకూడా నడిచింది.

వరండాలో పరంధామయ్యగారి ప్రక్కనున్న వాలు కుర్చీలో వెనక్కి వాలి పడుకున్నాడు శ్రీధర్. గాజుల గలగలలతో, కిలకిల నవ్వులతో, సన్నటి గుసగుసలతో లోపలికి వస్తున్న అమ్మాయిల్ని చూసి - అందులో మధ్య వున్న వసంతని గుర్తుపట్టి అతను తనకు తెలియకుండానే ఆసక్తితో లేచి కూర్చున్నాడు. అంతవరకూ అల్లుడితో యేదో మాట్లాడుతున్న పరంధామయ్యగారు వీళ్ళని చూసీ చూడటంతోనే ముఖం యింత చేసుకుని "ఎక్కడ్నుంచి షికారాక? పొండి పొండి. లోపలికి పొండి! యింత పొద్దు పోయేదాకా షికార్లు సాగించుకొస్తున్నారా?" అని కసిరాడు.

క్షణంలో సగం సేపు శ్రీధర్‌తో చూపులు కలిపిన వసంత ఒక్క అంగలో అందరికంటె ముందు యింట్లోకి పోయింది.

"ఒరే వెంకా! గంగాళంలోకి వేడినీళ్ళు తోడావా! ఇదుగో సుబ్బులూ! ఆ గిన్నెలు కడిగి ముందు యిక్కడ బోర్లించు" వంట యింట్లోంచి బామ్మగారి కంఠం ఖంగు మని విన్పిస్తోంది. ఏదో పనిమీద హడావుడిగా దొడ్లోకి వెళ్ళబోతున్న ఆవిడ అమ్మాయిల బృందాన్ని చూసి హఠాత్తుగా ఆగిపోతూ "ఏదీ వసంత వచ్చిందా? అలా పెళ్ళినడకలు నడుస్తావేం? చప్పున వెళ్ళి స్నానం చేసి బట్టలు మార్చుకురా! ఆ జడ—ఆ రేగిపోయిన జుట్టు— ఆ వెలిసి పోయిన పరికిణీ నువ్వూ, యీ వాలకంతోనే ఇతని ముందు నుంచి వచ్చావా? వెళ్ళు - యింకా చూస్తావేం? స్నానం చేసిరా! ఇదిగో సూడమ్మా సుమిత్రా! కాస్సేపు యీ సన్న

జాజులన్నీ చక్కగా పెద్దగా మాలకట్టు-రాధమ్మతల్లీ!నువ్వొచ్చావుగా? నీ కోసమే కబురుపంపుదా మనుకుంటున్నానే తల్లీ! శాస్త్ర లక్ష్మి, నువ్వూ అంతా కలిసి ఆ గది కొంచెం సర్ది పెట్టండి! అగరొత్తులవీ పంపిస్తాను. మాతల్లి-మాతల్లి శాస్త్ర సాయం చేసి పెట్టండి! మీ వసంత మొగుడు సామాన్యుడు కాదమ్మో మరి! చూడు, హఠాత్తుగా వచ్చి ఎలా హడావుడి పెట్టున్నాడో!" ఒక్క గుక్కలో - జి. టి. ఎక్స్ప్రెస్ స్పీడులో బామ్మగారు పనులు పురమాయించేసి వెళ్ళి పోయారు.

క్షణం సేపు ఒకళ్ళ మొహంలోకి ఒకళ్ళు ప్రశ్నార్థకంగా చూస్తున్న అమ్మాయిలు వెంటనే అర్థం అయిందిలే అన్నట్లు వసంతవైపు జూసి నవ్వుతూ గది సర్దటానికి వెళ్ళిపోయారు. సుమిత్ర వంగి పళ్ళెంలో వున్న పూలు తీసుకుని దారం కోసం వెతకసాగింది.

"అబ్బ! ఇప్పుడు స్నానం యేమిటి చలేస్తుంటే? లాభంలేదు. బామ్మ వాక్కు వేదవాక్కు! యెదురు లేదు. ఇహ మొదలు, యిలాటి యిష్టంలేని పనులు చెయ్యటానికి" జన్మలో రెండో పూట స్నానం చెయ్యటం అలవాటులేని వసంత వణుక్కుంటూ స్నానానికి బైలుదేరింది. స్నానం చేస్తూండగగా సుబ్బులొచ్చింది, "అమ్మాయిగారూ! బామ్మగారు మిమ్మల్ని యీ జరీ అంచు తెల్లచీర కట్టుకోమంటున్నారు" అంటూ.

"ఛీరేమిటి! నాకా చీరతో నిద్రపట్టదు, నాకొద్దు!"

అంది వసంత వేడి వేడి నీళ్ళ స్నానం చేసినా గడగడ వణుకుతూ.

"ఏమో నాకేం తెలుసూ? అల్లుడుగారికి పరికిణీలు నచ్చవుట!" సుబ్బులు యేదో చెప్పబోతూండగానే వసంత గభాల్న చీరె, జాకెట్ లాక్కుంది.

వసంత స్నానంచేసి బట్టలు వేసుకుని వచ్చేసరికి సుమిత్ర పూలమాల కట్టడం పూర్తయింది. వంట యింట్లో దేంట్లోనో పోపుపెట్టున్న బామ్మగారు అంటున్నారు: "యేమోనమ్మా! కావాలని చేసుకున్నాడు. అతనిష్టం—యెంతయినా చదువుకున్నాడు, నాకయితే యిష్టం లేదు, యేం చేస్తాం చెప్పు? ఆ మూడుముళ్ళూ పడనంత వరకే మన పెత్తనం అనుకో."

"అవును లెండి! ఇదిగో వసంత వచ్చింది. అయిందా స్నానం? యెంత బాగున్నావు ఆ చీరలో! చూడండి బామ్మగారూ! మీరు వసంత చేత యిహ ఆ పరికిణీ, పమిటా మాన్పించేయాలి, దువ్వెన తీసుకురా జడ వేస్తాను." అంది సుమిత్ర తెల్లటి చీరలో కొత్త అందాలు కల్పించుకుంటూన్న వసంతని రెప్ప వాల్చకుండా చూస్తూ.

సుమిత్ర జడ వేస్తుండగా లక్ష్మి, విమలా వచ్చారు—"అయిందండీ! అంతా చేసేశాం" అంటూ.

"అయిందా? సరే ఇదుగో! రేపు మీరంతా భోజనాలకి యిక్కడికే రావాలి. ఏం తెలిసిందా? యెల్లుండి వసంతని అతను తీసుకు వెళ్ళిపోతానంటున్నాడు." పాయసం

కోసం జీడిపప్పు వేయిస్తూ యివతలికివచ్చి అంటున్న బామ్మ గారి వైపు చురుగ్గా చూసింది వసంత అమ్మో! వెళ్ళిపోవటమా! అతన్తో ఒక్కతీ-బామ్మ రాకుండా తనెలా వెడ్తుంది. బామ్మ లేకపోతే తనకి ఒక్క-రాత్రి నిద్రపడ్తుందా ? ఒక్క క్షణం తోస్తుందా! ఏదో ఆలోచిస్తున్న వసంత దగ్గరగా చేరారు విమలా వాళ్ళు. "ఇదుగో చూడు వసంతా! అతని జుట్టు అంతా వంకీలు వంకీలు అని నేనూ, లేదు కాదు సాఫీగా మెత్తగా వుండే జుట్టని లక్ష్మి అంటోంది. ఏదైంది రేపు నువ్వు చెప్పాలి. మేమిద్దరం పందెం వేసుకున్నాం."

"ఛా! అన్నీ వెధవ మాటలు. నాకేం తెలుస్తుంది ! నువ్వే వెళ్ళిచూడు. నీకు కళ్ళులేవా?" వాళ్ళని తోసేస్తూ అంది వసంత కోపంతో. ఛి-ఛీ! తనెలా చూస్తూంది? వీళ్ళకు బుద్ధిలేదు- అనుకుంటూ "ఊరుకోండే, అదసలేసిగ్గుపడ్తూంటే! రేపు నువ్వడక్క- పోయినా చెప్తుంది. ఈరోజు మాట్లాడకు" అంది సుమిత్ర నవ్వుతూ - జారుగా వున్న వసంత జడని సరి చేసి పెద్ద పూలచెండుని పెట్టూ.

"సరే. మరి రేపు వస్తాం - వెడ్తాం' మరి నువ్వో?" అన్నారు వాళ్లు సుమిత్రని చూస్తూ.

"ఎవరు, సుమిత్రా? నేను యింటికి కబురు పంపాను. ఈ పూట భోజనాలు అయేదాకా యిక్కడే వుంటుంది" లోపల్నుంచి బామ్మగారు జవాబిచ్చారు. కొంతసే పయిం తర్వాత సుమిత్ర తప్ప అంతా వెళ్ళిపోయారు.

"వాళ్ళు భోజనానికి వస్తున్నారు. నువ్వు అటు కుడి వైపు వరండాలోకి వెళ్ళు" అంది సుమిత్ర చాలాసేపయిం

తర్వాత, గోడవారగా వున్న పీటమీద మోకాలి మీద గడ్డం ఆన్చుకుని బొమ్మలా కూర్చున్న వసంత నుద్దేశించి.

వసంత లేచి నిశ్శబ్దంగా వరండాలోకి వచ్చేసింది. ఆ రావటంలో ముందువైపున్న వరండాలోంచి తండ్రి కంఠం, దానితోపాటు మంద్రస్థాయిలో మృదు గంభీరంగా వున్న మరో కంఠంవినిపించాయి.

వరండాలోకి వచ్చిన వసంత అక్కడ కూర్చోవటాని కేమీ లేకపోవటంతో స్తంభానానుకుని నిలబడింది. వెన్నెల బాగా వచ్చేసింది. దూరంగా కన్పిస్తున్న గొడ్ల పాకలో వున్న ఆవులు, గేదెలు పడుకుని చక్కగా నెమరు వేస్తున్నాయి హాయిగా. వాటికేం దిగులు లేదు. పుట్టిన చోటనే వుంటాయి. అత్తవారింటికి వెళ్ళటం - కొత్తవాళ్ళ మధ్య తిరగటంఅంటూ వుండదు, అని ఆలోచిస్తున్న వసంత చూపులు తెల్లగా మెరుస్తోన్న తన చీరెమీద పడ్డాయి. చీరె అంచు చేత్తో పట్టి చూసుకుంటూ 'యెంత బాగుంది! యిప్పుడు కట్టుకుంటే లాభం యేమిటి? పగలు కట్టుకుంటే అందరూ చూస్తారు, ఖరీదెంత అని అడుగుతారు. ఈచీరెలో నువ్వెంత బాగున్నావు అని మెచ్చుకుంటారు. ఇప్పుడైతే యేముంటుంది? అనవసరంగా నలిగిపోవడం తప్ప—చీరె వంక చూసుకుంటూ ఆలోచిస్తున్న వసంత దగ్గరికి సుబ్బులు వచ్చింది. "అదేంటి అమ్మాయిగారు నిలబడ్డారేం! ఉండండి! మంచం తెస్తాను" పరుగెత్తుకుంటూ వెళ్ళి ఓ నవారు మంచం తెచ్చి వరండాలో వేస్తూ "పడుకోండి! కుసేపు నిద్రపొండి— ఆ తర్వాత నిద్రే వుండదు." అంది.

వసంత మంచంమీద కూర్చుంది. వెళ్ళబోతున్న సుబ్బులు ఆగి వంగి యేదో రహస్యం చెప్తున్నట్లుగా మొహం పెట్టి "అమ్మాయిగోరూ, అల్లుడుగోరికి సన్నజాజులంటే మా యిష్టంట, ఇందాక నేను మీకోసం అని కోసి తెస్తూంటే 'యేవే' అని తీసుకుని జోబీలో వేసుకున్నారు. మీ కిస్తారుగామును." అంతవరకు ఆసక్తిగా వింటున్న వసంత చివరమాట వింటూనే "ఛ" అని చెయ్యెత్తి కొట్ట టానికి లేవటంతో సుబ్బులు నవ్వుతూ పారిపోయింది.

'అందరికీ ఒకటే వేళాకోళం అయిపోయింది' అనుకుంటూ ముడుచుకున్న మొహంతో మంచంమీద వాలి పడుకుంది వసంత.

సాయంత్రం అంత పరుగెత్తి ఆటలాడటంతో, ఆపైన వేడి వేడి నీళ్ళ స్నానం చెయ్యడంతో, తెల్లటి, మెత్తటి బట్టల్లోవున్న వసంతకి చూస్తూండగానే నిద్రవచ్చేసింది. అలా యెంతసేపు పడుకుందో తనకే తెలియదు. ఇంతలో సుమిత్ర వచ్చి బాగా తట్టిలేపింది, "ఛి-ఛీ! అదేమిటి పసిపిల్లలా అలా పడుకున్నావు ? పూలన్నీ నలిగిపోవటంలా ! లే-లే! అన్నం తిందువుగాని-మంచిదానివే!" అంటూ.

సగం నిద్రమత్తుతోనే భోజనానికి వచ్చి కూర్చుంది. భోజనంలో పదార్థాలు చాలా రుచిగావున్నాయి. ముఖ్యంగా పులుసు, పాయసం- సుమిత్ర బామ్మగారి చేతి పనితనాన్ని మెచ్చుకుంటోంది. ఇంట్లో యిందాకటంతటి సందడి లేదు. నిశ్శబ్దంగా వుంది. పరంధామయ్యగారు కూడా పడుకునే ప్రయత్నంలో వున్నారు. భోజనం చేస్తున్నంతసేపూ వసంత

చెవులు మంద్రస్థాయిలో గంభీరంగా వినిపించే స్వరంకోసం ఆలకించి ఆశాభంగం పొందాయి.

"నే నిహ ఈ చీరమార్చేసుకోనా?" భోజనం అయిం తర్వాత వసంత బామ్మగారి కోసం వేసిన పక్కవైపు వెళ్ళ బోతూ అడిగింది.

"ఆగు! నీ పక్క అదికాదు" తమలపాకులు సుతా రంగా చీల్చి చిలకలుగా చుట్టి వెండి పళ్ళెంలో పేరుస్తున్న సుమిత్ర వసంతని పిల్చింది.

"ఎక్కడ మరి! ఈ సారి నిద్రపోతే ఇహ లేవను!" విసుగ్గా అంది వసంత.

ఎందుకో తెలియదుగానీ, సుమిత్ర—బామ్మగారు మొహాలు చూసుకుని నవ్వుకున్నారు. నవ్వుతున్న సుమిత్రకి సమాధానంగా బామ్మగారు "దానికేం తెలుసు? మొన్న డన్నా చూసిందా; పెట్టిందా?" అన్నారు.

ఆ చూడటం, పెట్టటం యే విషయంలోనాఅని ఆలో చిస్తూ వసంత వచ్చి మళ్ళీ సుమిత్ర ప్రక్కన కూర్చుంది.

ఆకులు కట్టటం పూర్తిచేసిన సుమిత్ర లేచి మోకా ళ్ళలో తల పెట్టుకు కూర్చున్న వసంత తల్లోపూలు సర్ధ సాగింది. "వుండనీ ఫర్వాలేదులే! ముందు యెక్కడ పడుకో వాలో చెప్పు బాబూ! నీకు పుణ్యం వుంటుంది, నిద్రవస్తోంది" సుమిత్రని బతిమిలాడ్తూ అంది వసంత.

"లే మరి చూపిస్తాను" అంది సుమిత్ర వసంతని చేయి పట్టి సున్నితంగా లేవదీస్తూ.

ఇద్దరూ కలిసి హాల్లోకి వచ్చారు. లోపల ఇల్లు సర్ద టం పూర్తయిన బామ్మగారు తలుపు వేస్తున్నారు.

"ఏటు?" అంది వసంత సుమిత్ర వెనక నడుస్తూ. హాల్లో గోడకున్న గడియారం టంగ్ టంగ్ మని 10 గంటలు కొట్టింది. రోజూ యీ పాటికి మంచి నిద్దట్లో వుండవలసిన సమయం.

"రేపు నిన్ను తప్పకుండా దొంగచేస్తాను. ఒట్టు!" సుమిత్రతో నడుస్తూ అంది వసంత.

"అలాగే! వెళ్ళు, ఆ గదిలో నీ పక్క" సుమిత్ర మాటలతో చటుక్కున ఆగిపోయింది. ఆ గది యిందాక లక్ష్మి—విమల వాళ్ళు సర్దింది. గదిలోంచి అగరొత్తుల వాసన గుప్పుమంటోంది. "ఊc! వెళ్ళు" అన్న సుమిత్ర మాటలతో గుమ్మం బైటనుంచే లోపలికి తొంగిచూసింది. వసంత తను చూడకూడని వస్తువేమైనా అక్కడుందేమో అనుకుంటూ - నిజం! గదిలోపల కిటికీ దగ్గరగా వున్న పడకకుర్చీలో తెల్లటి బట్టల్లో, కళ్ళమీద చేతు లుంచుకుని శ్రీధర్ పడుకుని వున్నాడు.

"ఇదేమిటి! నన్నిక్కడ పడుకోమంటావేమిటి? అక నుంచే!" వసంత ప్రక్కకు తిరిగేసరికి అక్కడ సుమిత్ర లేదు

దూరంగా వెళ్ళిపోతూనే వుంది. కాళ్ళకున్న పాంజే బులు, చేతికున్న గాజులు గల గల మనేట్లు ఒక్క పరుగులో పరుగెత్తుకొచ్చి సుమిత్రని కలుసుకుంది వసంత.

"ఇదేమిటి? అలా పరుగెత్తుకు వస్తావెందుకూ?" లోప

లోపలించి ఒకచేత్తో విసనకర్ర—మరో చేత్తో మరచెంబుతో నీళ్ళు పట్టుకుని యివతలకు వస్తున్న బామ్మగారు అంది.

“కాదు బామ్మా! లేకపోతేనూ—నన్నక్కడ పడుకోమంటోంది—అతనక్కడుంటే—” బామ్మవంక ఫిర్యాదు చేస్తున్నట్లు, అన్యాయం జరిగినట్లు చెపుతున్న వసంత కళ్ళు హఠాత్తుగా సిగ్గుతో క్రిందకు వాలిపోయాయి. ఆపైన మాట్లాడలేకపోయింది. సుమిత్ర కొంగు చాటు చేసుకుని నవ్వుతోంది. క్షణంసేపు మనవరాలివంక శ్రద్ధగా, పరీక్షగా చూసిన బామ్మగారు చేతిలోవున్న మరచెంబుని వంగి క్రింద పెట్టి వసంతని చేయిజాపి గుండెలకి దగ్గరగా తీసుకుని మెల్లగా యిలా అన్నారు: “చూడమ్మా! ఈరోజునుంచీ నీ పడక అతని ప్రక్కనే! అక్కడే పడుకోవాలి. పిల్లా! అతని కేది యిహా కావాలంటే యిహా నువ్వే యివ్వాలి. అందరిలాంటి వాడు కాదమ్మా అతడు. అతని మనసు గ్రహించి నువ్వు నడుచుకోవాలి. నా దగ్గరలాగా పెంకిగా జవాబు చెప్పకు—ఏం— పెంకితనం నాదగ్గర, నామీద చూపించు—ప్రేమ అతని దగ్గర. వెళ్ళు—తీసుకెళ్ళమ్మా సుమిత్రా!”

బామ్మ మాటల్లో అర్థం తెలిసిపోయింది వసంతకి.

గది అలంకరించటం, సుబ్బులు మాటల్లో హాస్యం, విమల పోట్లాటలో అర్థం, సుమిత్ర కొంగు చాటు చేసుకుని నవ్వటం — అన్నీ తెలిసిపోయిన వసంతకి బుగ్గల్లోంచి వెచ్చటి ఆవిరి వచ్చింది. అది తనకు తెలియదులే దేనికూ? యెలా అతనితో మాట్లాడటం? “పద!” అంటూ సుమిత్ర బొమ్మలా నిలబడిపోయిన వసంతని చెయ్యి పట్టుకుని తీసుకెళ్ళింది.

గుమ్మానికి యింకా అవతలగానే వదిలేసి సుమిత్ర వెళ్ళిపోయింది. వెళ్ళిపోతూ ఆగి, వసంత చెవిదగ్గరగా నోరు పెట్టి అతి రహస్యంగా "రేపు వస్తాను. అన్నీ నాకు చెప్పాలి. చెప్పకపోతే ఒట్టు!" అని వెళ్ళిపోయింది. గుమ్మంలోకి వచ్చి నిలబడిపోయింది వసంత. అత నీసారి పడుకొని లేడు. కిటికీ రెక్కమీద చెయి వేసి బైటకు చూస్తున్నాడు. ఆగిపోయిన పాంజేబుల చప్పుడు విని కాబోలు యిటు తిరిగాడు. మళ్ళీ క్షణాలో సగంసేపు ఇద్దరి కళ్ళూ కలుసుకున్నాయి. వసంత చూపులు వెంటనే భూమిలోకి దిగిపోయినాయి. అతను వెంటనే అక్కడున్నించి కదిలి రాలేదు. చూస్తూ అలాగే నిలబడిపోయాడు. యేం చేయాలో తోచని వసంత పయిట కొంగు తీసుకుని వ్రుడచుట్టసాగింది. వెనక్కు పారిపోతే బాగుండు ననిపిస్తోంది. చానీ కాళ్ళు కదలటంలేదు.

అతను ముందుకు వచ్చి చెయి కాపి అందిస్తూ "బైట నిలబడి పోయావేం? లోపలకు రా!" అన్నాడు.

అతను చెయ్యి అందుకోకుండానే బుద్ధిమంతురాలిలా లోపలికి వచ్చింది. "కూర్చో!" అతను చూపించిన కుర్చీలో కూర్చుంది. మళ్ళీ అతను మాట్లాడలేదు. అతనికి కూడా తనలాగే యేం మాట్లాడాలో తోచటంలేదుకాబోలు పాపం! ఎంతయినా కొత్తవాళ్ళని ఒక్కసారి అలా ఒంటరిగా వదిలేసి మాట్లాడుకోమంటే — వసంత కళ్ళెత్తి అతనివంక చూడబోయింది. కానీ అతను తనలాగా సిగ్గుపడటంలేదు. నిస్సంకోచంగా, ఆసక్తి నిండిన కళ్ళతో రెప్ప వాల్చకుండా చూస్తున్నాడు.

"ఇందాక వచ్చిన వాళ్ళంతా యెవరు? నీ స్నేహితు రాళ్ళా?" అవునన్నట్లు గబగబా తలూపింది.

మళ్ళీ కొంచెంసేపాగి అతను అన్నాడు: "నీకు సినిమాలంటే యిష్టమేనా?"

మళ్ళీ తలూపింది వసంత యిష్టమే అన్నట్లు.

"చదువుకోవడం?"

అదిగూడా యిష్టమే నన్నట్లు తలూపింది.

"తలూపటం తప్పనీకు మాటలు రావా?"

శ్రీధర్ మాటలు మొదలు అవటంతోనే తలూపుతున్న వసంత తలూపబోయి ఆగిపోయింది. నవ్వాడతను.

మళ్ళీ నిశ్శబ్దం. వసంత భరించలేకుండా వుంది.

కొంచెం అయిన తర్వాత అతను ఆగి మొదలు పెడ్తున్నట్లుగా "సన్నజాజిపూలంటే నాకెంత యిష్టమో తెలుసా?" అన్నాడు.

"తెలుసు!" అంది అస్పష్టంగా వసంత, మాట లొచ్చని రుజువు పరచటానికి.

"తెలుసా! యెలా?" అతని కంఠం కొంచెం ఆశ్చర్యంగా పలికింది.

"సుబ్బులు చెప్పింది!" చేతివేలి కున్న వుంగరం మీద చూపు నిలిపి అంది వసంత.

"ఓ! అదా" అతను నవ్వుతూ జేబు తడుము కున్నాడు.

"ఈ తెల్ల జరీ చీరె అంటే నాకెంతో యిష్టం! కావాలని నీ కోసం ఎన్నో షాపులు గాలించి కొన్నాను.

ఈ రోజు యిదే కట్టుకున్నావు నీ కెలా తెలుసు!" ఆ జరీ చీర పెళ్ళిలో శ్రీధర్ వాళ్ళు పెట్టిందే! కానీ అతని కది యిష్టం అని వసంతకి తెలియదు- యేం చెప్పాలి?- అను కుంటున్న వసంతవైపు చూస్తూ అతను — "సర్లే! పోన్లే- నీ కంత మాట్లాడటం యిష్టంలేకపోతే! నేను వెళ్ళి పడు కుంటాను" తెచ్చిపెట్టుకున్న కోపంతో అతను దూరంగా వెళ్ళిపోయాడు. వసంత కళ్ళెత్తి చురుగ్గా ధైర్యంగా చూసింది. బామ్మ మాటలు గుర్తొచ్చాయి. వసంత చూడటంతో అతను మళ్ళీ దగ్గరగా వచ్చాడు. ఈసారి ప్రక్కగా కాక వసంత వెన కగా వచ్చాడు. "సన్నజాజి పూలంటే నాకిష్టం అని చెప్ప లేదూ! నాకో రెండు పూలు యిస్తావా?" వెనకనుంచి మళ్ళీ వచ్చి యెదురుగుండా వున్న టేబిల్ అందుని ఆనుకుని నిల బడుతూ అన్నాడు.

వసంత చప్పున చెయిజాచి తల్లో చేతి కందినన్ని పూలు తెంపి అతని కిచ్చింది.

"అయ్యయ్యో! అలా తెంపావేం!" పూలకి బదులు చేతిని తీసుకుంటూ అడిగాడు శ్రీధర్.

వసంత కళ్ళెత్తి చూసింది. అతనూ చూశాడు. ఇద్దరి చూపులు ఒకళ్ళచేతిలో ఒకళ్ళుగా పట్టుకున్న పూలవంక చూశాయి.

వసంత చేయి వదిలించు కుందామనుకునే లోపలే అతను వదిలేశాడు.

"నాకొంచెం నీళ్ళు కావాలి. దాహం అవుతోంది."

వసంత చేతిలోంచి తీసుకున్న పూలని వాసన చూస్తూ అన్నాడు.

కూర్చున్న వసంత చప్పున లేచి టేబిల్ మీదున్న వెండి మరచెంబులో పెట్టిన నీళ్ళని గ్లాసులో పోసి ఇచ్చింది.

ఈసారి కూడా అతను గ్లాసుకు బదులు చేతినే తీసుకున్నాడు, కానీ యీసారి వసంత కళ్ళెత్తి చూడదల్చుకో లేదు, అతనికి మంచినీళ్ళు గాదు కావలసింది, తన చెయ్యి అని తెలిసింది వసంతకి. అలాగే వుంచేసింది చేతిని. వున్నట్లుండి— చేతిలో గ్లాసు తీసుకుని టేబిల్ మీద పెట్టటం, ఆ వెంటనే దగ్గరగావచ్చి ఒకచెయ్యి మెడచేట్టూ, మరోచెయ్యి కాళ్ళచుట్టూ వేసి పసిపిల్లను యెత్తినట్లు పైకెత్తేశాడు అతను. క్షణంసేపు తనేమౌతుందో తెలియని వసంత కెవ్వుమంది. వెంటనే దించేశాడు. వసంత గుండెలు గుబగుబా కొట్టుకోవటం మొదలుపెట్టాయి.

"భయమేసిందా?" నవ్వుతూ అన్నాడు అతను.

"పోన్లే నీకు కోపం వచ్చినట్టుంది. సరే! ఇహ నిన్ను తాకను. నేను వెళ్ళి పడుకుంటాను." అతను వెళ్ళిపోయి మంచంమీద పడుకున్నాడు. పడుకుని తల తిప్పి చూస్తూ "ఆఖరిది అడుగుతున్నాను. నేను తమలపాకులు వేసుకోలేదు. నువ్విస్తే వేసుకుని— 'యిది వసంత యిచ్చింది' అనుకుని తింటూ నిద్రపోతాను" అన్నాడు. ఇంకా దడదడ కొట్టుకుంటున్న గుండెల్తో వున్న వసంత అతనిస్పర్శ ఒళ్ళంతా కదుల్తున్న అనుభూతి పొందుతూ సన్నగా చిరు చెమటలు పట్టిన చెయిచాచి వేళ్ళతో సుమిత్ర కట్టిపెట్టిన ఆకులు

తీసుకువచ్చి యిచ్చింది. ఇహ యేమీ అననని అన్న అతని మాటలతో ధైర్యంగా వున్న వసంత చెయిచాచి ధైర్యం గానే యిచ్చింది. కాని అతను అన్నమాట మీద నిలబడే మనిషిలా లేదు-ఈసారి గూడా తమలపాకు బదులు చెయి తీసుకున్నాడు. తీసుకుని వూరుకోలేదు. పట్టిదగ్గరకు లాక్కు-న్నాడు! అసలే - భయంతో అదోమాదిరిగా వున్న వసంత తూలి అతని గుండెమీద పడింది. అలాపడ్డ వసంతని మళ్ళీ లేవనివ్వలేదు. మరింత దగ్గరగా లాక్కుంటూ వసంత చుట్టూ చేతులు వేసి "రహస్యంగా!" అన్నాడు అంతే! వసంతకి కాలం ఆగిపోయినట్టుగానూ, వెన్నెల్లో విద్యుత్తు ప్రసరించినట్లుగానూ, గాలిలో చక్కిలిగింత లున్నట్లుగానూ తోచింది.

కోడి కూయటం వసంతతోపాటు శ్రీధర్ కూడా విన్నాడు. కొన్ని యుగాల అనుభవం కలిగింది వసంతకి. "ఇహ వెడ్తావా? నేనుకొంచెంసేపు నిద్రపోతాను. తెల్లవార వస్తున్నట్లుందికదూ!" చీరె, పువ్వుల్తోపాటు తనూ నలిగి పోయి, అలిసిపోయినట్లుగా వున్న వసంతని మరోసారి గుండెల దగ్గరగా లాక్కుని కళ్ళల్లోకి చూస్తూ అడిగాడు శ్రీధర్. అలిసిపోయినా, వసంత కళ్ళు యేదో తెలియని ఒక అపూర్వ మైన కాంతితో మిలమిల మెరుస్తున్నాయి.

"ఊఁ" అంది వసంత అందంగా వంపులు తిరిగిన అతని పెదవులు, తీర్చిదిద్దినట్లున్న కనుబొమలు, యెన్నో విషయాలు తెలుసుననే గర్వంతో తొణికిసలాడుతున్న కళ్ళు అన్నీ ఒక్కొక్కటి పరీక్షగా చూస్తూ. నిజం! విమల

చెప్పింది కరెక్ట్! అతని జుట్టు చాలా నొక్కు-లుగా వుంది. అంత అందమైన జుట్టు చాలా కొద్దిమందికే వుంటుంది. ఇన్ని అందమైన విషయాలున్న చోట చాలా ఆకర్షణీయంగా వుండేవి, లాలనతో గూడిన అతని చిరునవ్వు.

"ఏమి టలా చూస్తూన్నావు?" అన్నాడు శ్రీధర్ తన వైపుగా మొదటిసారిగా నిస్సంకోచంగా చూస్తున్న భార్యని.

"ఏం లేదు — నే వెళ్తాను." అంది వసంత, యిన్ని రోజులు యితను తెలియకుండా నే నెలా వుండగలిగాను, అనుకుంటూ.

"సరే, పద!" వసంతని సాగనంపటానికి అతను గుమ్మందాకా వచ్చాడు.

"వెళ్తున్నావా?" అన్న అతని ప్రశ్నకు జవాబుగా గుమ్మం దాటబోతున్న వసంత ఆగి భుజంమీదుగా మెడతిప్పి చూసింది. శ్రీధర్ వెంటనే చేతులు చాచి వసంతని లోపలకు లాక్కు-న్నాడు. అలా మూడుసార్లు జరిగింది. నాలుగో సారి మంచంమీద పడుకొని కళ్ళు మూసుకుంటూ "నువ్వు వెళ్ళటం నేను చూడలేను, వెళ్ళు!" అన్నాడు.

గుమ్మందాకా వచ్చిన వసంత ఆగి వెనక్కు- తిరిగి చూసింది. అతను తలతిప్పి కళ్ళు తెరిచి చూస్తున్నాడు, కానీ లేచి రాలేదు. నవ్వింది వసంత. "నవ్వకు, వెళ్ళు!" అన్నాడు అతను, నవ్వి కళ్ళు మూసుకుంటూ,

మంచంమీద అప్పుడప్పుడే మెలకువ వస్తున్న బామ్మగారు అటూ యిటూ కదులుతూ యెవరో కూర్చున్నట్లుగా

తోచి చెయిజాపి "వసూ!" అన్నారు. "బామ్మా – నేనే!" అంటూ వసంత వంగి బామ్మగారి గుండెల్లో తలదాచుకుంది. "నేనే బామ్మా!" తనకు తను తెలియకుండానే బావురుమనేసింది వసంత.

"ఏమి టేమిటి – ఎందుకు?" పూర్తిగా మెలకువ తెచ్చుకున్న బామ్మగారు కంగారుపడ్తూ అడిగారు.

"నా కేమిటోగా వుంది" అస్పష్టంగా అంది వసంత.

క్షణంసేపు బామ్మగారు వసంత తల, బుగ్గలు నిమురుతూ వుండిపోయారు.

ఆ తర్వాత నెమ్మదిగా "పిచ్చిదానా! యేమిటోగా వుండటం యేమిటి? జీవితంలో మొదటిమజలీ! ప్రతి ఆడపిల్లా అలాగే అనుకుంటుంది" అన్నారు.

అయితే అందరికీ అలాగే అన్పిస్తుందన్న మాట-అన్పిస్తుందా? లేక తనొక్కదానికేనా? ఏమోమరి! వసంత నెమ్మదిగా బామ్మగారి ప్రక్కన చోటు చేసుకుని పడుకోవటానికి ప్రయత్నిస్తూ 'నాకీ అనుభవంలోఏదో ప్రత్యేకత కన్పిస్తోంది. అందరిలా నేనుకాదు' అనుకుంది.